# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేద్కర్
# కోనసీమ
జిల్లా వార్తలు

ఆదివారం 2 జూన్ 2024 | 5


**ఎండా కాలమ్**

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| అమలాపురం | 33 | 30 |

**దారి దోపిడీ దొంగలు అరెస్టు** 8లో

• (అమలాపురం టౌన్)

**బై..బై వైసీపీ**



# కూటమికే కిరీటం

## మెజార్టీ ఎగ్జిట్ పోల్స్‌లో జయభేరి
## జిల్లాలో క్లీన్‌స్వీప్ అంటూ సర్వేలు

### వైసీపీ అడ్డదారులు

ఈసారి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలనే కాంక్షతో అధికార వైసీపీ అనేక అడ్డదార్లు తొక్కింది. అయిదేళ్ల అరాచక, పాలనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం కావడం, అటు ఉద్యోగుల్లోను తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో అధికారంలోకి రామేమోనన్న భయం వైసీపీని వెన్నాడింది. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి కూటమిగా ఎన్నికల బరిలో నిలబడడంతో నియోజకవర్గాల్లో వైసీపీ ఓటర్లకు వేలల్లో డబ్బులు పంచింది. మద్యం డంప్‌లు దించింది. కడప మురాలను ప్రయోగించింది. పోలింగ్ రోజు గొడవలు, కొట్లాటలకు దిగింది. అదే సమయంలో ప్రతిపక్ష టీడీపీ సైతం ఈ ఎన్నికలను చావోరేవోగా తీసుకుంది. జనసేనతో జతకట్టి ఎన్నికల్లో పోటీ చేసింది. అభ్యర్థుల ఎంపికలో ఆచితూచి వ్యవహరించింది. వెరసి అధికార వైసీపీ ఆర్థిక, అంగబలాన్ని బలంగా తట్టుకుని నిలబడింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమిదే విజయం అని ముందు నుంచీ సర్వత్రా అంచనాలు నెలకొన్నాయి. ఒక పక్క టీడీపీ అధినేత చంద్రబాబు, మరోపక్క జనసేన అధినేత పవన్ జిల్లాలో విస్తృతంగా తిరిగారు. అన్ని నియోజకవర్గాల్లో సభలు, సమావేశాలతో దుమ్మురేపారు. అటు పోలింగ్‌రోజు ఓట్లు చీలకుండా సమీకరణ భారీగా జరిగింది. అటు వైసీపీపై ఆగ్రహంతో ఉన్న జనం ఓట్లతో అధికార పార్టీని చాచికొట్టారు. భూహక్కు చట్టం భయంతో లాగిపెట్టి బూత్‌ల్లో కొట్టారు. ఎక్కడెక్కడి నుంచో వలస ఓటర్లు ఓపిగ్గా వచ్చి ఓట్లేశారు.

### తీర్పు క్లియర్..?

గతనెల 13న జిల్లాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సరళి బట్టి టీడీపీ, జనసేన భారీగా విజయం సాధించబోతున్నట్లు భారీ విశ్లేషణలు వ్యక్తమయ్యాయి. అధికార వైసీపీ అరాచకాలు, ప్రజావ్యతిరేక నిర్ణయాలతో విసుగెత్తిన ఓటర్లు ఆ పార్టీని ఓటుతో చాచికొట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం గెలుపు ఖాయం అని ప్రతి ఒక్కరి నోటా వచ్చింది. దీనికి తగ్గట్టుగానే ఎగ్జిట్‌పోల్ సర్వే ఫలితాలు కూడా టీడీపీ కూటమిదే విజయమని తేల్చేశాయి.



మాట్లాడుతున్న రవిప్రకాష్

### 2 కి.మీ.. మేర రెడ్ జోన్

అమలాపురం టౌన్, జూన్ 1: కౌంటింగ్ కేంద్రాల చుట్టూ రెండు కిలోమీటర్ల మేర రెడ్‌జోన్‌గా ప్రకటించినట్టు సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రత్యేక అధికారి, ఎస్‌ఈబీ కమిషనర్ ఎం.రవిప్రకాష్ తెలిపారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి ప్రభుత్వ విధులు నిర్వహించే అధీకృత సిబ్బంది మినహా ఇతరులకు లోనికి వెళ్లే అవకాశం లేదన్నారు. స్ట్రాంగ్ రూముల చుట్టూ గగనతలంలో అనధికార డ్రోన్ కార్యకలాపాలను రెండు కిలోమీటర్ల మేర నిషేధించామన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 3, 4, 5 తేదీల్లో మద్యం షాపులను పూర్తిగా మూసివేయాలన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో ట్రైనీ ఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ కరణం కుమార్, కాకినాడ అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, రాజమహేంద్రవరం అదనపు ఎస్పీ పి.అనిల్‌కుమార్‌తో పాటు డీఎస్పీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### స్థల పరిశీలన

చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాలకు హాజరయ్యే వారి వాహనాల పార్కింగ్ కోసం గుర్తించిన స్థలాలను జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లాతో కలిసి ఎస్పీ ఎస్.శ్రీధర్ పరిశీలించారు. కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు కచ్చితంగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తి అయ్యే వరకు కౌంటింగ్ కేంద్రం ఆవరణలో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో ద్రాక్షారామలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. సఖినేటిపల్లి, అంబాజీపేట, అయినవిల్లి పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే నగర బహిష్కరణ, పీడీ యాక్టులు అమలు చేస్తామని హెచ్చరించారు. అల్లవరం మండలం నక్కా రామేశ్వరంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, సీఐ పి.వీరబాబు, ఎస్ఐ జి.హరీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 33 డ్యూటీ పెయిడ్ లిక్కరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

### 95 శాతం ఒకేమాట

95శాతం సర్వే సంస్థలన్నీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ప్రకటిస్తే 5 శాతం మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రకటించాయి. ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్నాయన్న ముందస్తు సమాచారంతో పల్లె,పట్టణమన్న బేధం లేకుండా ప్రజలు టీవీలకు అతుక్కుపోయారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ సర్వే సంస్థలు ఒకేసారి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో లోక్‌సభ స్థానం టీడీపీదేనని స్పష్టంగా ప్రకటించాయి. టీడీపీ తరపున గంటి హరీష్ మాధుర్, వైసీపీ తరపున రాపాక వరప్రసాదరావు పోటీపడ్డారు. ఇక జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముమ్మిడివరం, కొత్తపేట, మండపేటల్లో కూటమి తరపున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు ఘన విజయం సాధిస్తున్నారని సర్వే ఫలితాలు ప్రకటించాయి. ఇక అమలాపురంలో అయితాబత్తుల ఆనందరావు, రామచంద్రపురం నుంచి వాసంశెట్టి సుభాష్, జనసేన తరపున రాజోలు నుంచి దేవ వరప్రసాద్ ఘన విజయం సాధిస్తున్నారని, గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానం నుంచి గిడ్డి సత్యనారాయణ విజయం సాధిస్తున్నారని ప్రకటించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించి క్లీన్ స్వీప్ చేస్తున్నట్టు సర్వే సంస్థలు ప్రకటించాయి. దాంతో కూటమి నాయకులు, కార్యకర్తల్లో మంచి జోష్ నెలకొంది. కొందరైతే సంబరాల్లో మునిగిపోయారు. ఇక వైసీపీ ఓటమి ఖాయమని సర్వే సంస్థలు ప్రకటించడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు డీలా పడిపోయారు.

అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూటమిదే పైచేయిగా తేలింది. భారీ సీట్ల ఆధిక్యతతో అధికారంలోకి రాబోతున్నట్లు సుస్పష్టమైంది. అధికార వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోతున్నట్లు శనివారం సాయంత్రం విడుదలైన ఎగ్జిట్‌పోల్ ఫలితాలు తేటతెల్లం చేశాయి. అన్ని సంస్థలు టీడీపీ కూటమికే పట్టం కట్టాయి. భారీ మెజార్టీతో టీడీపీ ప్రభుత్వం రాబోతున్నట్లు తేల్చి చెప్పాయి.ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించినట్టు ప్రకటించాయి. శనివారం రాత్రి ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను వివిధ సంస్థలు ప్రకటించాయి.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

### 2 రోజులే




అమలాపురం టౌన్, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఇక రెండు రోజులే మిగిలింది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉండబోతాయోనన్న ఉత్కంఠ జిల్లా వాసుల్లో నెలకొంది. శనివారం రాత్రి విడుదలైన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు కూటమికే పట్టం కట్టడంతో ఆయా పార్టీల శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఓట్ల లెక్కింపు కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. అత్యధికంగా జిల్లాలో 83.84 శాతం ఓట్లు పోలయ్యాయి. మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 87.06 శాతం, అత్యల్పంగా రాజోలులో 79.02 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లాలో పురుషులు 6,44,189 మంది మహిళలు 6,39,808 మంది, ఇతరులు 11 మందితో కలిసి మొత్తం 12,84,008 మంది ఓటు హక్కును వినియోగించుకోవడంతో 83.84 శాతం పోలింగ్ నమోదైంది.

## ఏర్పాట్లు పూర్తి

**సీసీ కెమెరాల నిఘాలో కౌంటింగ్..పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేక కౌంటర్లు**

**కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ హిమాన్షుశుక్లా**

అమలాపురం టౌన్, జూన్ 1: సీసీ కెమెరాల నిఘాలో ఈ నెల 4న చేపట్టనున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి అయినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరించి చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని, లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు వేర్వేరుగా లెక్కింపు ఉంటుందని పోస్టల్ బ్యాలెట్ల ఓట్ల లెక్కింపుపై అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయి అవగాహనతో ఉండాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను శనివారం కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌంటింగ్ ప్రక్రియలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు ఉంటారు. ఒక్కో టేబుల్‌కు కేటాయించిన అధికారుల బృందం పూర్తి స్థాయిలో సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో సెక్షన్ 144 అమలులో ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని సమన్వయం పాటించాలని సూచించారు. సంఘ విద్రోహ శక్తుల జోక్యాన్ని అరికట్టేందుకు, శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ ప్రాంగణంలో ప్రభుత్వ విధులు నిర్వహించే అధీకృత సిబ్బంది మినహా ఇతరులకు అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన పూర్తి అయ్యే వరకు కౌంటింగ్ ఆవరణలో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, సంబరాలకు అనుమతి లేదన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుందని, అరగంట తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఏ రౌండ్‌కు ఆ రౌండ్ ఫలితాలు ప్రకటించిన తర్వాతే తదుపరి రౌండ్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు, లోక్‌సభ స్థానానికి జరుగుతున్న కౌంటింగ్‌ను పరిశీలించేందుకు నియమితులైన సాధారణ పరిశీలకులు లెక్కింపు కేంద్రాల్లో ఉండి ప్రక్రియను నిశితంగా పరిశీలించనున్నట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఆర్వో జి.కేశవర్ధనరెడ్డి తదితరులు ఉన్నారు.



## జై హనుమ..

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ముమ్మిడివరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభయాంజనేయస్వామికి విశేషాలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు..

మరిన్ని వార్తలు..8లో

**సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి** 7లో

**ఎస్ఈబీ ఐజీ ఎం.రవిప్రకాష్**



ముమ్మిడివరం: సీహెచ్ గున్నేపల్లిలో పడిన విద్యుత్ స్తంభం



ముమ్మిడివరం: క్రాపచింతలపూడి శాంతినగర్‌లో ఇంటిపై పడిన కొబ్బరిచెట్టు



ఉప్పలగుప్తం: సూదాపాలెంలో కూలిన చెట్టు



# గాలి..వాన

## విరిగిపడిన చెట్లు..విద్యుత్ స్తంభాలు



అమలాపురంలో వర్షం

ముమ్మిడివరం, జూన్ 1: వర్షంతో పాటు వీసిన సుడిగాలుల తో భారీ నష్టం జరిగింది. శనివారం తెల్లవారుజామున ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై భారీ గాలులు వీచి వర్షం కురిసింది. ఈ గాలులకు మండలంలో రోడ్ల పక్కనున్న కొబ్బరిచెట్లు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. కొబ్బరిచెట్లు విద్యుత్ తీగలు, నివాస గృహలపైనా పడడంతో నష్టం వాటిల్లింది. పెనుగాలులకు ముమ్మిడివరం మండలంలో వందకు పైగా కొబ్బరి చెట్లు విరిగి పడిపోయాయి. అక్కడక్కడా భారీ వృక్షాలు కూడా నేలకొరిగాయి. ఇరవై విద్యుత్ స్తంభాలు నేలకొరగ్గా రెండు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రెండు కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు ధ్వంసమయ్యాయి. మరో కిలోమీటరు మేర కేబుల్ వైరు ధ్వంసమైనట్టు ట్రాన్స్‌కో అధికారులు గుర్తించారు. పలుచోట్ల పూరిపాకలు పడిపోయాయి. వర్షాలు, గాలులకు శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.



యానాం: చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల ప్రాంగణం

### అమలాపురంలో వర్షం

అమలాపురం టౌన్, జూన్ 1: శనివారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పలు ప్రాంతాల్లో కురిసింది. ఉరుములు, మెరుపులతో ఆకాశం దద్దరిల్లింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఆ తర్వాత వర్షం తగ్గినప్పటికీ ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉండడంతో జిల్లాలో పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దానికి తోడు ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపిలేని విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడిపోయారు. వర్షంతో వాతావరణం చల్లబడుతుందనుకున్న జిల్లా వాసులు ఉక్కపోతతో తడిసి ముద్దయ్యారు.

### వర్షపాతం వివరాలు

తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలోని కె.గంగవరం మండలంలో అత్యధికంగా 35.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా ఆత్రేయపురంలో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండపేటలో 2 మిల్లీమీటర్లు, రాయవరంలో 3.4, రామచంద్రపురంలో 18.2, కొత్తపేటలో 3.2, కపిలేశ్వరపురంలో 19.4, ఐ.పోలవరంలో 27.6, ముమ్మిడివరంలో 25.4, అయినవిల్లిలో 11.4, పి.గన్నవరంలో 8.4, అంబాజీపేటలో 10.2, మామిడికుదురులో 7.2, రాజోలులో 8.8, మలికిపురంలో 4.8, సఖినేటిపల్లిలో 8.6, అల్లవరంలో 19.8, అమలాపురంలో 15.2, ఉప్పలగుప్తంలో 25.4, కాట్రేనికోన మండలంలో 23.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున జిల్లాలో 12.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



గోదావరి మాతకు పూజలు

## సెంట్రల్ డెల్టాకు నీరు విడుదల

ఆత్రేయపురం, జూన్ 1: సెంట్రల్ డెల్టా కాల్వలకు శనివారం సాగునీటిని విడుదల చేశారు. బొబ్బర్లంక హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం ఉదయం 10.30 గంటలకు ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు పూజలు నిర్వహించి సెంట్రల్ డెల్టా కాల్వలకు సాగునీరు విడుదల చేశారు. గోదారమ్మకు పసుపు, కుంకుమ, పుష్పాలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి 500 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. అధికారులు చెప్పినట్టుగానే జూన్ 1న సాగునీటిని కాల్వల ద్వారా పంట పొలాలకు విడుదల చేశారు. దశలవారీగా కాల్వలకు నీటిని విడుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ పిల్లా సత్యనారాయణ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

**భక్తులతో కిటకిటలాడిన వాడపల్లి** 7లో

### మునిసిపల్ ఆర్‌డీగా

## నాగ నరసింహరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న సీహెచ్ నాగ నరసింహరావు

రాజమహేంద్రవరం సిటీ/కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1 : రాజమహేంద్రవరం మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్‌గా సీహెచ్. నాగనరసింహరావు నియమితులయ్యారు. మునిసిపల్ ఆర్‌డీగా పనిచేసిన నాగళ్ళ వీర వెంకట సత్యనారాయణ పదవీ విరమణ కావడంతో ఆయన స్థానంలో కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావును ఆర్‌డీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 1999 గ్రూప్-2 బ్యాచ్‌కు చెందిన నాగ నరసింహరావు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో భీమవరం, పాలకొల్లు, కొవ్వూరు, నరసాపురం మునిసిపాలిటీలకు కమిషనర్‌గా సేవలందించారు. కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆర్‌డీ నాగనరసింహరావు మాట్లాడుతూ రాజమహేంద్రవరం మునిసిపల్ ఆర్‌డీగా అంకితభావంతో సేవలందిస్తానన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల పరిధిలో 34 మునిసిపాలిటీలు తన పరిధిలో ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా పనిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా పలు మునిసిపాలిటీలకు చెందిన కమిషనర్లు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఏపీ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, సిబ్బంది అభినందించారు.

# కాలువలకు జలకళ..




ధవళేశ్వరం వద్ద స్విచ్చాన్ చేసి నీటిని విడుదల చేస్తున్న కలెక్టర్ మాధవీలత

- డెల్టా కాలువలకు సాగునీరు విడుదల
- మూడు కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల
- 'తూర్పు' కలెక్టర్ మాధవీలత పూజలు

ధవళేశ్వరం, జూన్ 1: రైతులు సకాలంలో నాట్లు పూర్తి చేసుకుంటే పంట ప్రకృతి విపత్తుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అందుకే జూన్ 1న సాగునీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత అన్నారు. గోదావరి డెల్టా పరిధిలోని మూడు ప్రధాన పంట కాల్వలకు శనివారం సాగునీరు విడుదల చేశారు. ఉదయం తూర్పుడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద ఆమె గోదావరి మాతకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు సమర్పించారు. స్లూయిజ్‌గేట్లు ఎత్తి మోటార్ స్విచ్ ఆన్‌చేసి తూర్పుడెల్టా కాలువకు నీటిని విడుదల చేశారు. తదుపరి గోదావరి డెల్టా సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు మిగిలిన 3 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు మధ్యడెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద పూజలు నిర్వహించి కాలువకు సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఈస్ట్రన్ డివిజన్ ఈఈ కె.రామకృష్ణ, డీఈ ఇ.రమేష్, ఏఈఈ కె.నాగలక్ష్మి, ఏఈలు అద్దంకి సాయిరాం, ఆర్.సునీల్‌బాబు పాల్గొన్నారు.

### పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల



ధవళేశ్వరం వద్ద గేట్ల నుంచి విడుదల అవుతున్న నీరు



విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద నీటిని విడుదల చేస్తున్న ఈఈ దక్షిణామూర్తి

నిడదవోలు, జూన్ 1: నిడదవోలు మండలం విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ వద్ద శనివారం పశ్చిమ డెల్టా కాలువలకు నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎమ్.దక్షిణామూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి స్విచ్ ఆన్‌చేసి నీటిని విడుదల చేశారు. కాలువలు కట్టేసిన అనంతరం తిరిగి పశ్చిమ డెల్టా కాలువలకు శనివారం నీటిని విడుదలచేసిన సందర్భంగా విజ్జేశ్వరం బ్యారేజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరించారు. గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి చీర, రవిక, గాజులు, పువ్వులు, పండ్లు సమర్పించారు. అనంతరం హారతులిచ్చి ఈఈ దక్షిణామూర్తి బ్యారేజ్ వద్ద స్విచ్ ఆన్ చేసి పశ్చిమ డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటిరోజు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని, తర్వాత అవసరానికి తగినట్టుగా పెంచుతామన్నారు. పశ్చిమ డెల్టా పరిధిలోని రైతాంగం సార్వాను త్వరగా ప్రారంభించుకోవడం ద్వారా దాళ్వా కూడా త్వరగా ప్రారంభం అవుతుందన్నారు. ముందుగానే నీటిని విడుదల చేస్తున్నందున రైతాంగం ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శెట్టిపేట జేఈ కిరణ్ కుమార్, నీటి పారుదలశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కార్యక్రమంలో ఎక్కడా రాజకీయ నాయకులు లేకపోవడంతో కార్యక్రమ మంతా అధికారుల చేతులమీదుగా సాగింది.

# సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

- అల్లర్లలో కోనసీమ నంబరు వన్
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- అల్లర్ల అణచివేతకు క్యూఆర్టీ బృందాలు
- ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈబీ ఐజీ రవిప్రకాష్, చిత్రంలో ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, జూన్ 1: ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు శాంతిభద్రతల ప్రత్యేక అధికారి, ఎస్ఈబీ ఐజీ ఎం.రవిప్రకాష్ తెలిపారు. ఏలూరు రేంజ్‌లో కోనసీమలో అల్లర్లతో నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఏలూరు జిల్లా పరిధిలో దెందులూరు, నూజివీడు, కృష్ణాజిల్లాలోని గన్నవరం, పెనమలూరు, మచిలీపట్నం నియోజకవర్గాలను సెన్సిటివ్ నియోజకవర్గాలుగా గుర్తించామన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.శ్రీధర్‌తో కలిసి శనివారం ఐజీ రవిప్రకాష్ విలేఖరులతో మాట్లాడారు. ఏలూరు రేంజ్‌లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలతో పాటు ఎక్కడా అల్లర్లు జరగకుండా క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్టీ)లను ఏర్పాటు చేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి జీపీఎస్ లోకేషన్స్ ఫీడ్‌చేసి క్యూఆర్టీ బృందాలకు అందించామన్నారు. ఒక్కో బృందానికి 5 నుంచి 15 గ్రామాల బాధ్యతను అప్పగించాం. ఎక్కడైనా గొడవ జరిగితే ఐదారు నిమిషాల వ్యవధిలోనే క్యూఆర్టీ బృందాలు అక్కడకు చేరుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎస్ఐ, సీఐల ఆధీనంలో క్యూఆర్టీ టీములను ఏర్పాటు చేశామన్నారు.

### కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశాం. ఇప్పటికే సెక్షన్ 30తో పాటు 144 సెక్షన్ అమలులో ఉందని వివరించారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించేందుకు అనుమతి లేదన్నారు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని రేంజ్‌లో గతంలో ఆయా ప్రాంతాల్లో పనిచేసిన పోలీసు అధికారులను శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా నియమించామన్నారు. వీరితోపాటు పారా మిలటరీ, ఏపీ ఎస్పీ ఇతర బలగాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోలీసులు ప్రజాస్వామ్య పరిరక్షకులుగా ఉండడం పట్ల గర్వపడుతున్నామన్నారు. హింసకు పాల్పడడంవల్ల ప్రజలే నష్టపోతారన్నారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే కోర్టులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ప్రజలు కూడా బాధ్యత వహించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలన్నారు. ఇప్పటికే ప్రజాతీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉందని, ఎన్నికలు వస్తుంటాయి. పోతుంటాయి ప్రజలు కులాల పేరిట, వర్గాల పేరిట కొట్టుకోవడం తగదని హితవు పలికారు. డీజీపీ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ పార్టీలతో పాటు స్ట్రైకింగ్ ఫోర్సులు, పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. గొడవలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద జిల్లా ఎస్పీ శాంతిభద్రతల పరిరక్షకులుగా ఉంటారన్నారు. లెక్కింపు సమయంలో గెలుపు ఓటముల ప్రభావం గ్రామాల్లో పడే అవకాశం ఉన్నందున వాటిని అరికట్టేందుకు క్యూఆర్టీ బృందాలు సిద్ధంగా ఉన్నట్టు ఐజీ వివరించారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ఆలయంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

## గోవింద నామస్మరణలతో మార్మోగిన వెంకన్న ఆలయం

- స్వామి ఒక రోజు ఆదాయం రూ.35.61లక్షలు

ఆత్రేయపురం, జూన్ 1: కోనసీమ తిరుమల వాడపల్లి పుణ్యక్షేత్రం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనం స్వామివారికి ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని దర్శించుకున్నారు. అశేష భక్తజనం తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల ద్వారా పోటెత్తిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒకరోజు ఆదాయం రూ.35.61లక్షలు లభించినట్టు ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

- వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నప్రసాద భవన నిర్మాణానికి మండపేటకు చెందిన బొడ్డు అవినాష్ కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం అందించారు. డిప్యూటీ కమిషనర్ భూపతిరాజు కిశోర్‌కుమార్ దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు.

### శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,21,420, అన్నదాన విరాళాలు రూ.62,408 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 9,440 తులాభారం రూ.350, లడ్డూ ప్రసాదం ద్వారా 15,915 వెరసి రూ.3,09,533 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపాయి.. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణా చార్యులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం: తిరుపతి శృంగారవల్లభస్వామి, దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

### పద్మ పురస్కారాలకు క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం టౌన్, జూన్ 1: గణతంత్ర వేడుకల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఏటా అందించే అత్యున్నత పద్మ పురస్కారాలు-2025కు అంతర్జాతీయ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా అధికారి పీఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అంతర్జాతీయ క్రీడల్లో జిల్లా నుంచి అత్యున్నత ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన క్రీడాకారులు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆగస్టు 1వ తేదీలోగా దరఖాస్తులను ఇ మెయిల్ ద్వారా అందజేస్తే అర్హులైన క్రీడాకారుల జాబితాను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### శనేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు



శనేశ్వరాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపేట, జూన్ 1: మందపల్లి మందేశ్వర (శనేశ్వర) ఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. స్వామివారి సర్వ దర్శనాల అనంతరం తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2,01,943 ఆదాయం లభించినట్టు ఆలయ ఏసీ, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.



### పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నడకుదురు (కరప), జూన్ 1: కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురు పంటకాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. స్థానిక మైత్రి ఫర్నీచర్ షాప్ సమీపంలోని పంటకాలువలో మృతదేహం ఉన్నట్టు తమకు సమాచారం రాగా ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టామన్నారు. 60-70 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వృద్ధుడు పంటకాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తూ అందులో పడి మరణించినట్టుగా భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరుస్తామని, అతని ఆచూకీ తెలిసిన వారు వివరాలను 9440 796557కుగాని, కరప పోలీస్‌స్టేషన్‌కుగాని తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తిచేశారు.

### మోటార్ విడి భాగాలు పడి కార్మికుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన దేవుడు

పెద్దాపురం, జూన్ 1: కాకినాడ జిల్లా పెద్దాపురం వాలుతిమ్మాపురం ప్రధాన రహదారిలో ఉన్న పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మోటార్ విడి భాగాలు తలపై పడడంతో ఓ కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో పారా బాయిలర్ వద్ద పనిచేస్తున్న ఉల్లి దేవుడు (36)పై మోటార్ విడిభాగాలు పైనుంచి తలపై పడడంతో తీవ్రంగా గాయాలపాలై మృతి చెందాడు. అయితే పరిశ్రమ యాజమాన్యం మాత్రం ఈ విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసిందని కార్మిక సంఘాలు ఆరోపించాయి. ఇటీవల కాలంలో పరిశ్రమలో అనేక ప్రమాదాలు జరిగినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. మృతుని కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్, గడిగట్ల సత్తిబాబు, చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై పోలీసులు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

### గంజాయి నిందితులకు రిమాండ్



గంజాయి తరలిస్తున్న నిందితులతో ఎస్ఐ సంతోష్‌కుమార్, ఎంఈవో తాతబ్బాయిదొర

వై.రామవరం, జూన్ 1: మండలంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను శనివారం అరెస్టుచేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మండల ఎగువ ప్రాంతాల్లో గుర్తేడు, దారగడ్డ మీదుగా మోటారు బైక్‌పై గంజాయిని తరలిస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు కొమరవరం సమీపంలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కృష్ణాజిల్లాకు చెందిన కుంబా సాయిప్రసాద్, ఆయాజిత్తుల కులదీప శ్రీనివాస మృత్యుంజయ, ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కారా కృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. వారివద్ద నుంచి ఆరు కేజీల గంజాయితో పాటు ఒక మోటారు బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అడ్డతీగల సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి తాతబ్బాయిదొర, పోలీసు సిబ్బంది ఉన్నారు.

### బాలబాలాజీ స్వామికి విశేష పూజలు



బాలబాలాజీస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మామిడికుదురు, జూన్ 1: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం పురస్కరించుకుని అర్చకులు విశేష పూజలు చేశారు. వేకువజాము నుంచి భక్తులు వైనతేయ నదిలో స్నానమాచరించి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. తలనీలాలు సమర్పించే భక్తులతో కల్యాణకట్ట కిటకిటలాడింది. కొత్త, పాత ఆలయాల వద్ద భక్తుల కోలాహలంతో సందడి నెలకొంది. శనివారం వివిధ ఆర్జిత సేవల టిక్కెట్ల విక్రయాలు రూ.2,70,590 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 3,849మంది భక్తులు దర్శించుకుని 3,061మంది అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

### రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పు జట్లకు మూడో స్థానం



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు

పిఠాపురం, జూన్ 1: రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లుకు మూడవ స్థానం లభించింది. విశాఖ జిల్లా తిమ్మాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి మెన్స్ అండ్ గర్ల్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా రగ్బీ జట్లు మంచి ప్రతిభ కనబరచాయి. రెండు జట్లు మూడవ స్థానంలో నిలవడంతో క్రీడాకారులను రగ్బీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కోచ్ పి.లక్ష్మణరావు, టీఎమ్ మేనేజర్లు బి.వంశీ నవీన్, పవన్, జి.శివప్రసాద్‌లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి. శ్రీనివాసకుమార్, కె.పద్మనాభం, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ నాగలింగేశ్వరరావు, సభ్యులు వియ్యపు రామన్నరాజు, కేతవరపు కృష్ణ, సోము గోవిందరాజు తదితరులు అభినందించారు.

### ఎన్నికల కౌంటింగ్

## 2వ ర్యాండమైజేషన్ పూర్తి

- కౌంటింగ్‌కు నలుగురు పరిశీలకులు
- జిల్లా ఎన్నిక అధికారి డాక్టర్ మాధవీలత



రెండో ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌వో మాధవీలత , ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాత్‌రామ్, టాన్ సింగ్ జి, మోమిన్

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1 : ఎన్నికల కౌంటింగ్ 2వ ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులు బీజై కుమార్ కందయాత్ రాయ్, టాన్ సింగ్ జిమోమిన్ సమక్షంలో శనివారం సాయంత్రం ర్యాండమైజేషన్ నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కే మాధవీలత మాట్లాడుతూ పూర్తి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు సాంకేతికపరమైన విధానంలో కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. రెండో ర్యాండమైజేషన్‌లో భాగంగా కౌంటింగ్ నిర్వహించే క్రమంలో తొలి ర్యాండమైజేషన్‌లో గుర్తించిన సిబ్బందిని నియోజకవర్గాల వారీగా కేటాయింపులు చేస్తామని తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ జిల్లాకు నలుగురు ఎన్నికల కౌంటింగ్ పరిశీలకులను నియమించినట్టు తెలిపారు. కె.బాల సుబ్రహ్మణ్యం, కమల్ కాంత్ సరోచ, బీజైకుమార్ కందయాత్ రాయ్, టాన్‌సింగ్ ఐజీ మోమినిల సమక్షంలో జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ తేజ్ భరత్, డీఆర్‌వో జి.నరసింహులు, సీపీవో ఎల్.అప్పలకొండ, ఎన్‌ఐసీ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విత్తన దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- రూ.1.49 లక్షలు విలువైన విక్రయాలు నిలిపివేత

గొల్లప్రోలు, జూన్ 1: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని విత్తనాలు, ఎరువులు దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్, శివ ఏజెన్సీస్‌లో తనిఖీలు జరిపారు. స్రవంతిలో స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంతో రూ.1.49 లక్షలు విలువైన 82.175కిలోల ప్రత్తి విత్తనాల విక్రయాలను నిలుపుదల చేస్తూ స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేశారు. శివ ఏజెన్సీస్‌లో అన్నీ సక్రమంగా ఉన్నాయి. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజియన్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో నిరంతరాయంగా తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరైనా ఎక్కువ ధరలకు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు అక్రమంగా నిల్వ ఉంచినా నకిలీ విత్తనాలు విక్రయించిన చట్ట ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలనాయుడు, శ్రీనివాసరెడ్డి, భార్గవరమేష్, నవీన్, జగన్నాథరెడ్డి, వల్లీ, కిషోర్, శివ, మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలులోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

### 10వరకు 'సెంటాక్' గడువు పెంపు

యానాం, జూన్1: పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో స్వీకరిస్తున్న దరఖాస్తుల గడువు ఈనెల10వరకు పొడిగించినట్టు అధికారులు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారామెడికల్ కోర్సులు, ఆర్ట్స్ సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల10వ తేదీలోపు పంపాలన్నారు.

- పుష్పాలు, పండ్లతో ఆంజనేయస్వామి ఆలయాలు అలంకరణ
- స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు
- హనుమాన్‌చాలీసా పారాయణ

# వైభవంగా హనుమజ్జయంతి



మండపేట: కరాచిసెంటరు భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు, ఆత్రేయపురం: భక్తాంజనేయస్వామికి పూజలు, కొత్తపేట: కొత్తపేటలో భక్తాంజనేయస్వామి, అంతర్వేది: అంతర్వేదిలో ధ్యానాంజనేయస్వామి, పి..గన్నవరంలో పంచముఖ ఆంజనేయస్వామి, అయినవిల్లి: సిరిపల్లిలో పంచముఖ అభయాంజనేయస్వామి

ముమ్మిడివరం, జూన్ 1: హనుమాన్‌జయంతిని మండలంలోని పలు హనుమాన్ మందిరాల్లో శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామిని వివిధ రకాల పుష్పాలు, పండ్లతో విశేష అలంకారం చేశారు. ముమ్మిడివరంలోని అభయాంజనేయస్వామివారి ఆలయంలో అర్చకులు సుదర్శనం రామచిరంజీవాచార్యుల ఆధ్వర్యంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన, కుంభపూజ, అభిషేకం, తమలపాకుల పూజ, సింధూరార్చన, శాంతిహోమం తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం రామరక్షా స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ముమ్మిడివరం విష్ణాలయం సెంటర్, పెద్దవంతెన సెంటర్, రాయుడువారిపాలెం, పళ్లవారిపాలెం, క్రాపచింతలపూడి, కొమానపల్లి, అనాతవరం, గేదెల్లంక, గాడిలంక తదితర గ్రామాల్లో హనుమాన్‌జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

**మండపేట:** హనుమాన్‌జయంతి వేడుకలను మండపేట పట్టణం, మండలంలో శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని హనుమత్‌వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రథంగుడి సెంటరులో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందేళ్ల చరిత్ర గల కరాచి సెంటరులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో సువర్ణ వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సిందూరపూజ, తమలపాకుల పూజలు నిర్వహించారు. ఆలయ బ్రహ్మ ఖండవల్లి పవన్‌కుమార్ సారధ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు. స్థానిక బూరుగుంట చెరువు వద్ద ఉన్న రామాలయం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి వారిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకు న్నారు. తాపేశ్వరం, అర్తమూరు. వెలగతోడు, మారేడుబాక, మెర్నిపాడు, ఏడిద, ఏడిద సీతానగరం, ద్వారపూడి, కేశవరం గ్రామాల్లో హనుమాన్‌జయంతిని జరుపుకున్నారు. ఆలయాలు వద్ద భారీగా అన్నసమారాధనలు నిర్వహించారు.

**మామిడికుదురు:** హనుమజ్జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మామిడికుదురులోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద పాశర్లపూడిలంక, అప్పనపల్లి, నగరం తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని పురస్కరించుకుని తమలపాకుల పూజ, గంధసింధూరం పూజ, అభిషేకాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**కె.గంగవరం:** మండలంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పామర్రు శ్రీరామ్‌నగర్ కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసమారాధన చేశారు. ఊడిమూడి ఆంజనేయస్వామి ఆలయంలో కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేక పూజలు చేశారు. కోటిపల్లి, గంగవరం, సుందరపల్లి, అముజూరు గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

**అయినవిల్లి:** హనుమజ్జయంతినిపురస్కరించుకుని మండలంలోని పలు హనుమాన్ మందిరాలను విశేషంగా అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామివారికి సింధూరార్చన, తమలపాకుల పూజ, అష్టోత్తర శత నామాలతో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిగాయి. సత్సంగాలు, హోమాలు జరిపారు. పలుచోట్ల హనుమాన్ ఆలయాల్లో అన్న సమారాధనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సిరిపల్లి గ్రామంలో ఉన్న పంచముఖ అభయాంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు గుత్తుల సూర్యనారాయణ, దొమ్మేటి వెంకట బాలాజీ, అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో వెయ్యి మందికి అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గుత్తుల తాండవకృష్ణ, దొమ్మేటి వెంకటేశ్వరరావు, గుత్తుల శ్రీనివాసరావు, కొప్పిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**రాయవరం:** మండలంలోని వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వెదురుపాక తుల్యభాగ కాలువ సమీపంలో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఆలయ అర్చకుడు పుల్లెటికుర్తి వెంకట సూర్యనారాయణశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి వివిధ రకాలద్రవ్యాలతో అభిషేకాలు, సింధూరపూజ, నాగవళిదళ అర్చనలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వి.సావరం అభయాంజనేయస్వామి ఆలయం వద్ద అభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించారు. రాయవరం పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హనుమాన్ జయంతి పూజల్లో పాల్గొన్నారు.

**పి.గన్నవరం:** లంకలగన్నవరం శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీఖండవల్లి నారాయణాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద గల శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానేపల్లి, ముంగండ, కె.ముంజవరం నరేంద్రపురం, ఉడిమూడిగ్రామాల్లో శ్రీహనుమాన్ దేవాలయాల్లో హనుమాన్ జయంతిని వైభవంగా నిర్వహించారు.

**అంతర్వేది:** అంతర్వేదిలో ధ్యానాంజనేయస్వామి విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉన్న హనుమాన్ మందిరాల్లో తమలపాకులతో అభిషేకాలు, సింధూరార్చనలు జరిగాయి. కేశవపాలెం హనుమాన్ సెంటర్, శృంగవరప్పాడు, మోరి, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గొంది తదితర గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఆలయాల వద్ద భజనలతో పాటు భక్తిగీతాలు ఆలపించారు. ఆలయాల వద్ద అన్నసమారాధనలు జరిగాయి.

**రాజోలు:** రాజోలులోని హనుమాన్ ఆయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచి హనుమాన్ మందిరాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. హనుమాన్ ఆలయాలను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి భక్తులు సింధూరం, తమలపాకులతో అర్చనలు, అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. పలు ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

**కపిలేశ్వరపురం:** గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆంజనేయస్వామికి అభిషేకాలు, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని ప్రధాన కూడలిలో స్వామివారి గ్రామోత్సవాన్ని భాజాభజంత్రీల నడుమ జరిపారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు.

**రామచంద్రపురం(ద్రాక్షారామ):** రామచంద్రపురం పట్టణం, మండలంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలో రాజగోపాల్ సెంటర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఏలూరి వెంకన్నబాబు, పాపాజీ మాస్టర్ హనుమాన్ చాలీసా పారాయణంచేశారు. పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. మజ్జిగ, అన్నప్రసాద వితరణ జరిపారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయ ప్రాంగణంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం జరిగింది. వెల్లలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పాల్గొని పూజలు జరిపారు. తోటపేట, వెంకటాయపాలెం, వెలంపాలెం, నరసాపురపుపేట గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు జరిగాయి.

**అంబాజీపేట:** అంబాజీపేట పశువుల సంత మార్కెట్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. పెద్దవీధిలోని నాగమల్లి చెట్టు వద్ద ఉన్న దాసాంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు హనుమాన్ ఆలయాలలో లక్ష తమలపాకుల పూజ, గంధసింధూరపూజ, అభిషేకాలు చేపట్టారు. స్వామివార్ని పురవీధుల్లో ఊరేగించారు.

**అల్లవరం:** మండలంలోని పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హనుమంతుని భారీ విగ్రహాలు, రామాలయాల వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా సింధూరార్చన, తమలపాకులు, పండ్లతో అభిషేకాలు జరిగాయి. యెంట్రుకోన, గోడిలంక, ఓడలరేవు, కొమరగిరిపట్నం, తాడికోన, అల్లవరం, డి.రావులపాలెం, కోడూరుపాడు, బెండమూర్లంక, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం గ్రామాల్లో హనుమజ్జయంతి వేడుకలు జరిగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నసమారాధనలు జరిగాయి. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, నార్గన శ్రీనివాస్, కంకిపాటి పెదబుజ్జి, రాసూరి రాంబాబు యెంట్రుకోనలో అభయాంజనేయస్వామినిదర్శించుకున్నారు.

**అలమూరు:** మండలంలో హనుమాన్ జన్మదినోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. హనుమాన్ ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలమూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సందిపూడి, జొన్నాడ, మూలస్థానం, చొప్పెల్ల, మడికి నర్సిపూడి మోదుకూరు, చింతలూరు తదితర గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. గుమ్మిలేరులోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద మహిళలు పూజలు చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది.

**కాట్రేనికోన:** హనుమజ్జయింతి సందర్భంగా కుండలేశ్వరంలో కాళ్ళకూరి కామేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పూడి అభయాంజనేయ స్వామికి రంబాల చిట్టిబాబు, గంగాభవాని ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కాట్రేనికోన, పల్లం, గచ్చకాయలపోర, కందికుప్ప, పల్లంకుర్రు, చెయ్యేరు గ్రామాల్లో హనుమజ్జయింతి పూజలు జరిగాయి.

**ఆత్రేయపురం:** హనుమజ్జయంతి వేడుకలు వాడవాడలా ఘనంగా నిర్వహించారు. హనుమాన్‌కు పంచామృతాభిషేకం, సింధూరార్చన, తమలపాకులతో అభిషేకాలు నిర్వహించారు. ఆత్రేయపురం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు ర్యాలి, బొబ్బర్లంక, లొల్ల తదితర గ్రామాల్లో భక్తులు పోటెత్తారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని హనుమాన్ చాలీసా నిర్వహించారు. అనంతరం భక్తులు హనుమాన్‌ను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

**కొత్తపేట:** వాడవాడలా హనుమాన్ మందిరాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొత్తపేట కొత్త రామాలయం ఏకశిల హనుమాన్ మందిరంలో, బోడిపాలెం, మారుతీ సెంటర్ హనుమాన్ మందిరాలకు భక్తులు పోటెత్తి విశేష అర్చనలు జరిపించారు. హనుమాన్ విగ్రహానికి తమలపాకుల దండలు వేశారు. మారుతి సెంటర్‌లో బిళ్లకోట మారుతిబంగారం ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అన్న సమారాధన నిర్వహించారు.

### నాడు-నేడు-2 పాఠశాలల సందర్శన

కాట్రేనికోన, జూన్1: జిల్లా ఏపీసీ ఎం.మధుసూధరనావు శనివారం లచ్చిరాజుచెరువు, కుంచెనపల్లి, పల్లిపాలెం, బొజ్జావారిపేట, దొంతికుర్రు, చింతలమెరక, గచ్చకాయలపోర పాఠశాలలను సందర్శించారు. పనుల నిలిపివేతకు కారణాలు తెలుసుకున్నారు.సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు పాల్గొన్నారు.

### ఓట్ల లెక్కింపుపై నాయకులతో సమీక్ష

యానాం, జూన్ 1: యానాం ఆర్‌ఏ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఈనెల4న జగనున్న పుదుచ్చేరి పార్లమెంట్ ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి సమీక్ష నిర్వహించారు. కౌంటిగ్ హాలులో పాటించాల్సిన నిబంధనలు తదితర అంశాలను వివరించారు. యానాం ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, బీజేపీశాఖ అధ్యక్షుడు కనకాల రాజు, కాంగ్రెస్ అధ్యక్షుడుఅర్గాని దినేష్, అన్నడీఎంకే ప్రతినిధి మంచాల సత్యసాయి కుమార్, డీఎంకే ప్రతినిధి భాషా పాల్గొన్నారు.

### జూన్30 వరకు సెక్షన్ 30 అమలు

రామచంద్రపురం, జూన్ 1: రామచంద్రపురం సబ్‌డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలు జూన్ 30వరకు పొడిగిస్తున్నట్లు డీఎస్పీ బి.రామకృష్ణ శనివారం తెలిపారు. రామచంద్రపురం, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు.

### భూలోక సత్తెమ్మతల్లి తీర్థమహోత్సవం

పి.గన్నవరం, జూన్ 1: మానేపల్లి గ్రామదేవత శ్రీభూలోక సత్తెమ్మతల్లి జాతర అనంతరం శనివారం తీర్థమహోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన మహిళల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. సమీప గ్రామాల ప్రజలు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఆత్రేయపురం, జూన్ 1: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు కోడ్ అమలులో ఉందని, సెక్షన్ 144 పోలీసు యాక్టు అమలులో ఉన్న కారణంగా రెచ్చగొట్టే ప్రకటనలు, ఊరేగింపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

### అముజూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి

కె.గంగవరం, జూన్ 1: అముజూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కోడూరి రామకృష్ణ ప్రసాద్(68) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన 2015 నుంచి 2019 వరకు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అముజూరు సొసైటీ ప్రస్తుత అధ్యక్షుడు సాదే ఏడుకొండలు, సిబ్బంది, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు యెనుమల గోపాలకృష్ణ (చిట్టిబాబు) సంతాపం తెలిపారు.

### 9వరకు దివ్యాంగుల సర్వే

ఉప్పలగుప్తం, జూన్ 1: మండలంలో సచివాలయాల వారీగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 18సంవత్సరాల లోపు దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్నట్టు భవిత కేంద్రం ఐఈఆర్టీలు చిక్కం గంగాదేవి, పి.వెంకటేష్ తెలిపారు. శనివారం దివ్యాంగుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వం ద్వారా దివ్యాంగులకు లభించే సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు ఏపాఠశాలలో చేరని విద్యార్థులను గుర్తించి నివేదిక సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి 20మందిని గుర్తించినట్టు తెలిపారు.



### బోడసకుర్రు బ్రిడ్జి పనులు

అల్లవరం, జూన్ 1: బోడసకుర్రు వద్ద బెండా పంటకాల్వపై పంచాయతీశాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైనతేయ ఏటిగట్టు సమీపంలోని పంటకాల్వపై ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన నిధులు రూ.1.5కోట్లతో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాంక్రీట్ ట్యూబ్‌ల క్వాలిటీ పనులను పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు, డీఈఈ అన్యం రాంబాబు, ఏఈ పి.సత్యనారాయణ పరిశీలించారు. వరద సమయాల్లో ఉపయోగపడేలా భారీ వాహనాలు వెళ్లే విధంగా 14మీటర్ల పొడవు, రెండు స్పాన్స్‌లతో పటిష్టంగా వంతెన నిర్మాణం జరుగుతుందని డీఈ అన్యం రాంబాబు చెప్పారు. గతంలో ఇనుప గడ్డర్లతో ఏర్పాటు చేసిన వంతెన శిథిలం కాగా కొత్త వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు.

## ఈదురుగాలులతో వర్షం.. కూలిన విద్యుత్ స్తంభాలు



అల్లవరం మండలంలో గాలులకు చెట్టు పడి కూలిన విద్యుత్ స్తంభం

అల్లవరం, జూన్ 1: మండలంలో శనివారం ఉదయం వీచిన భారీ గాలులు, వర్షాలకు గోడిలంక, గూడాల, అల్లవరం, కొమరగిరిపట్నంతో సహా పలు గ్రామాల్లో కొబ్బరి తదితర చెట్లు పడి 12 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గాలుల వల్ల మామిడికాయలు నేలరాలాయని రైతులు ఆందోళన చెందారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా యుద్ధప్రాతిపదికన స్తంభాల పునరుద్ధరణ చర్యలు చేపట్టామని టాన్స్‌కోఏఈ బి.వెంకటేశ్వరరావు తెలిపారు.

### ఈదురుగాలులు, భారీ వర్షం

యానాం, జూన్ 1: యానాంలో శనివారం తెల్లవారుజామునవాతావరణంలో మార్పువచ్చింది. భారీ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు విపరీతంగా వీచడంతో నియోజవర్గంలోని పలుచోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గంటకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు క్రీడాప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉన్న స్ట్రాంగ్ రూమ్ సమీపంలో వర్షం నీరు నిలిచిపోయి జలమయంగా మారింది. కూలిన చెట్లను యంత్రాంగం తొలగింపు చర్యలు చేపట్టింది. భానుడి ప్రతాపంతో విలవిలాడిన ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు.

### నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

ఉప్పలగుప్తం, జూన్ 1: మండలంలో శనివారం ఉదయం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. గాలులకు పలు గ్రామాల్లో కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. చల్లపల్లి, సూదాపాలెం గ్రామాల్లో ఇళ్లపై చెట్లు విరిగి పడటంతో ధ్వంసమయ్యాయి. అరటి చెట్లు పూర్తిగా నేలనంటాయి. ఉప్పలగుప్తం, చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో 27 విద్యుత్ స్తంభాలు నేలకొరిగినట్లు ఏఈ శ్రీహరి తెలిపారు. కిలో మీటరు మేర 11కేవీ లైన్ పూర్తిగా ధ్వంసమయ్యిందన్నారు. ఉదయం నుంచి మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పునరుద్ధరణ చర్యలు వేగంగా జరుగుతున్నట్టు ఏఈ వివరించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఈ నెల 2వ తేదీన గ్రామాలకు తాగునీటి సరఫరా జరిగే పరిస్థితి లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, జూన్ 1: శనివారం వర్షం, గాలులకు మండల వ్యాప్తంగా చెట్లు నేలకూలాయి. విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పల్లంకుర్రు లైన్‌పేటలో సాపే వెంకటరమణకు చెందిన తాటాకిల్లునేలమట్టమైంది. గిడ్డివారిపేట, చెయ్యేరు గ్రామాల్లో పెంకుటిళ్లపై కొబ్బరి చెట్లు పడి ఇళ్లు దెబ్బతిన్నాయి.

## ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ముమ్మిడివరం, జూన్ 1: ముమ్మిడివరం సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.మదన్‌మోహనరావు తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ సమావేశపు హాలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 4వ తేదీ ఉదయం 8గంటలకే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలోని రూమ్ నంబరు 2101 ఫస్ట్ ఫ్లోర్‌లోని స్వామివివేకానంద సెమినార్ హాలులో రెండు రుమ్స్‌లో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను 8.30గంటలకు పూర్తి చేయాలని, తరువాత ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఒక రౌండుకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 19 రౌండ్లకు 266పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా మిగిలిన రెండు పోలింగ్ కేంద్రాల లెక్కింపు 20వ రౌండ్‌లో పూర్తవుతుందన్నారు. ఒక రౌండ్ లెక్కింపు పూర్తి అవ్వడానికి 30నిమిషాలు పడుతుందన్నారు. నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మధ్యాహ్నం 3గంటలకు పూర్తవుతుందన్నారు. సెక్షన్ 144అమలులో ఉన్నందున నిబంధనలు పాటించి ఓట్లు లెక్కింపు సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు అంతా సహకరించాలని ఆర్వో కోరారు.

### వేగుళ్లకు అభినందనలు

మండపేట, జూన్1: మండపేట నుంచి వేగుళ్ల జోగేశ్వరరావు నాల్గవసారి కూటమి తరపున భారీమెజార్టీతో విజయం సాధిస్తారని టీడీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వేగుళ్లను అమలాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేతలు పెచ్చెట్టి చంద్రమౌళి, రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేతలు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గరికపాటి సూర్యనారాయణ, చింతపల్లి వీరభద్రరావు కలిసి అభినందనలు తెలిపారు మాదిగ సంఘం పెద్దలు ఎమ్మెల్యే వేగుళ్లను కలిసి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో మాదిగ సంఘ నాయకులు దూళి జయరాజు, మండపల్లి చంద్రశేఖర్, ముమ్మిడివరపు నారాయణ, దోరకయ్య మాస్టారు, వల్లూరి ఇందిరారాణి, బోత్స నరసింహమూర్తి, వేమగిరి మోషే కోడి చినఅప్పారావు ఉన్నారు.

### విజయం సాధించాలని పూజలు

ఆత్రేయపురం, జూన్ 1:సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీలనుంచి పోటీచేసిన క్షత్రియులు విజయం సాధించాలని కోరుతూ ప్రసిద్ధి పుణ్యక్షేత్రాల్లో శనివారం పూజలు నిర్వహించారు. ఆత్రేయపురం క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో గాదిరాజు ప్రసాదరాజు బృందం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి, వాడపల్లి వెంకన్న ఆలయాల్లో పూజలు నిర్వహించారు. వివిధ పార్టీల తరపున 13మంది క్షత్రియులు పోటీ చేశారు. మురమళ్లలో కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజును క్షత్రియపరిషత్ సభ్యులు కలిసి ప్రసాదాలందించారు.



## దారి దోపిడీ దొంగలు అరెస్టు

### రూ.3వేలు, చాకులు, మోటారుబైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్1: దోపిడీ దొంగలను రామచంద్రపురం అరెస్టు చేశారు. సీఐ పి.దొరరాజు, ఎస్ఐ కె.సురేష్‌బాబు తెలిపిన వివరాలివి. రామచంద్రపురం రాజబాబునగర్‌కు చెందిన రౌడీషీటర్ గంపల విజయశేఖర్ అలియాస్ పండుపై ఏడు క్రిమినల్ కేసులు ఉన్నాయి. అతడు మిత్రులతో కలిసి దోపిడీలకు పాల్పడుతున్నాడు. మే 30వతేదీ రాత్రి 10.30గంటలకు కొత్తూరుకు చెందిన గండ్రోతు వీరకిషోర్ పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. కిషోర్‌ను నలుగురు వ్యక్తులు ఆపి కత్తులతో బెదిరించి అతని వద్ద నుంచి రూ.2వేలు నగదు, సాయిబాబా బంగారు ఉంగరం లాక్కుని పరారయ్యారు. మరో వ్యక్తిని ఆపగా అతడు ఖాకీ రంగు ప్యాంట్ ధరించి ఉండటంతో పోలీసుగా భావించి వదలివేశారు. అనంతరం కార్లో వెళుతున్న మరో వ్యక్తిని ఆపి బెదిరించి రూ.2వేలు లాక్కున్నారు. విలువైన వస్తువుల కోసం కత్తులతో బెదిరించగా భయపడి ఆ వ్యక్తి కారు వేగంగా నడుపుకుంటూ వెళ్లిపోయాడు. శనివారం మళ్లీ దొంగతనం చేసేందుకు ప్రణాళిక రూపొందించుటకు పండు, నాని, చిన్నిలు స్థానిక వైఎస్ఆర్‌నగర్ వద్ద రైల్వేస్టేషన్ వద్ద కూర్చుని నాగబాబు కోసం చూస్తుండగా పోలీసులు చాకచక్యంగా దాడిచేసి అరెస్టు చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. వీరి వద్ద నుంచి చాకులు, నగదు, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకుని స్థానిక కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు. కొత్తూరుకు చెందిన గండ్రోతు వీరకిషోర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాలతో డీఎస్పీ బి.రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరరాజు, ఎస్ఐ సురేష్‌బాబు సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. రామచంద్రపురం మండలం చోడవరం బైపాస్‌రోడ్డులో దారి దోపిడీలకు పాల్పడిన రాజబాబునగర్‌కు చెందిన గంపల విజయశేఖర్ అలియాస్ పండు, తుమ్మలపల్లి లేమేకు అంబ్రోస్ అలియాస్ నాని, తాతపూడి చిన్నిలను పోలీసులు శనివారం అరెస్టు చేశారు.

### ఇంటి వంటను మరిపించేలా భోజనం

ఆలమూరు, జూన్ 1: మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే వంటకాలు ఇంటి వంటకాలను మరిపించేలా ఉండాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా డైరెక్టర్ ఎన్.సురేష్ కోరారు. చెముడులంక జడ్పీ హైస్కూల్‌లో శనివారం మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్బంగా డైరెక్టర్ సురేష్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో నూరు శాతం విద్యార్థులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంట్లో మనపిల్లలు తినే విధంగా వంటకాలను రుచికరంగా తయారు చేయాలన్నారు. అగ్నిమాపక అధికారి సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో గ్యాస్ వాడకంలో ఎదుర్కొనే సమస్యలను భోజన పథకం సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పివి.సుబ్బరాజు, కార్యాలయం సిబ్బంది శివరంజని పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి

అంబాజీపేట, జూన్1: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని శుభ్రంగా అందించాలని ఎండీఎం జిల్లా అడిషనల్ డైరెక్టర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, కె.ప్రకాష్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి తినేలా మెనూ ప్రకారం వంటచేసి అందించాలన్నారు.

### మట్టి తవ్వకాల అడ్డగింపు

కపిలేశ్వరపురం, జూన్ 1: టేకి గ్రామ ఆయకట్టు పరిధిలో అనుమతులు లేకుండా నల్లూరు, టేకి గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మట్టిని తరలిస్తున్నారు. వ్యవసాయక్షేత్రం నుంచి మట్టిని తవ్వి రోడ్డు పక్కన డంప్ చేస్తుండగా రెవెన్యూ అధికారులు స్పందించారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్‌ను వీఆర్‌వో ఎం.మల్లేష్, ఆర్ఐ శ్రీనివాసరావు సీజ్‌చేసి, అంగర పోలీసులకు శుక్రవారం రాత్రి స్వాధీనపర్చారు. ఈవిషయమై మైన్స్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఆర్ఐ శ్రీనివాసరావు తెలిపారు. మాచర గ్రామపరిధిలో మట్టి తవ్వకాలు జరిగినట్లు వీఆర్‌వో రాజారత్నం పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. సొంత భూముల్లో మట్టి తరలింపునకు రైతులు తహసీల్దార్ వద్ద అనుమతులు పొందకపోతే చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు.

### సింహాచలం వరకు యాత్ర

అంతర్వేది, జూన్ 1: మోరి గ్రామానికి చెందిన ఏలూరి శివవెంకటసుబ్బారావు హనుమజ్జయంతిని పురస్కరించుకుని కాషాయ జెండాలతో అలంకరించిన ద్విచక్ర వాహనంపై యాత్ర ప్రారంభించారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని సింహాచలం లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధానం వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు.